క్లుప్తంగా

సీఎం దంపతులకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మంత్రి పొంగులేటి కుటుంబ సభ్యులు

ఖమ్మంవన్‌టౌన్: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ప్రసాదరెడ్డి కుమారుడు లోహిత్‌రెడ్డి వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులను ఆహ్వానించారు. ఈమేరకు మంగళవారం ఉదయం మంత్రి శ్రీనివాసరెడ్డి – మాధురి దంపతులు, ప్రసాదరెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు సీఎం నివాసంలో శుభలేఖ అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందిస్తున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: అక్షరాల తోవ ఆరో వార్షికోత్సవం సందర్భంగా వారం వారం నిర్వహించిన కవితల పోటీల్లో బహుమతి పొందిన కథలు, కవితలతో రాస్తున్న పుస్తకం ముద్రించేందుకు ఎన్నెస్పీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుడు యలమద్ది వెంకటేశ్వర్లు(వైవీ) అందించిన రూ.15 వేల చెక్కును పాఠశాల హెచ్‌ఎం శంకర్రావు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా అక్షరాల తోవ బాధ్యులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ మాట్లాడుతూ.. వైవీ ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ షఫీ, పునాటి వెంకటేశ్వర్లు, సునంద, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ సభను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 26న ఖమ్మంలో జరిగే భారత రాజ్యాంగ అమలు దినోత్సవ సభను జయప్రదం చేయాలని బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర నాయకుడు పోడకంటి రాంబాబు కోరారు. మంగళవారం ఖానాపురం ఎస్సీ కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ జేబీ రాజు, డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు గోపాల్‌రావు, లింగన బోయినలక్ష్మణ్, లక్ష్మీనారాయణ, కృష్ణ, శ్రీను, దానేలు, మల్లేశ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన సంతోష్

ఖమ్మంవన్‌టౌన్: ఏకగ్రీవంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బల్మూరి వెంకట్‌ను మంగళవారం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకట్‌ను శాలువాతో సత్కరించాక మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు వెంకట్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. వెంకట్‌ను కలిసిన వారిలో ఖమ్మం, మధిర అసెంబ్లీ యువజన అధ్యక్షులు కొండూరి హృదయ్ కిరణ్, తూమాటి నవీన్‌రెడ్డి, మాజీ ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ఇన్‌చార్జ్ అర్జున్ మహంతి తదితరులు ఉన్నారు.

మోదీ కృషితోనే బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ

ఖమ్మం మామిళ్లగూడెం: దేశ ప్రధాని నరేంద్ర మోదీ కృషితోనే అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గల్లాకు మంగళవారం జిల్లా కార్యాలయంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గల్లా మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలు వచ్చేలా చేస్తే ఈ జిల్లాకు ఉపాధి పెరిగే అవకాశముందన్నారు. జిల్లా నాయకులు వాసుదేవరావు మాట్లాడుతూ.. సోమవారం అయోధ్యలో జరిగిన బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు కనీసం రాష్ట్రంలో సెలవు కూడా ప్రకటించలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉప్పల శారద, జిల్లా అధికార ప్రతినిధి దనియాకుల వెంకటనారాయణ యాదవ్, చావాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	సైంధవ్
సాయిరాం	నా సామిరంగ, గుంటూరు కారం
ఆదిత్య	సలార్
శ్రీనివాస	హనుమాన్
సుందర్	హనుమాన్

– ఖమ్మంగాంధీచౌక్

మూనాళ్ల ముచ్చటే..!



రోటరీనగర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న మార్కెట్



వీడీవోస్ కాలనీ సమీకృత మార్కెట్‌లో తాళం వేసి ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ షెడ్డు



నూతన బస్టాండ్ మార్కెట్‌లో అమ్మేవారు రాకపోవడంతో ప్రారంభించిన రియల్ ఎస్టేట్ ఆఫీస్

రోడ్లపైనే కూరగాయలు, పండ్ల విక్రయాలు

- ఖాళీగా దర్శనమిస్తున్న సమీకృత వెజ్ మార్కెట్లు
- తాళం తెరవని నాన్‌వెజ్ మార్కెట్లు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యాన ప్రజల అవసరాల నిమిత్తం గత ప్రభుత్వం నగరంలో పలుచోట్ల వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేసింది. కానీ అవన్నీ అశాస్త్రీయంగా ఏర్పాటు చేయడంతో తక్కువ కాలంలోనే కొనుగోలు చేసేందుకు ఎవరూ రాక వెలవెలబోతున్నాయి. కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన వాటిని అత్యంత హంగు ఆర్భాటాలతో ప్రారంభించారు. కానీ ఆయా మార్కెట్లలో ప్రజలు కూరగాయలు కొనుగోలు చేయకపోవడంతో ఆ మార్కెట్లకు కూరగాయలు తెచ్చే రైతులు, అమ్ముకునే వారు ఇబ్బందులు పడుతున్నారు.

కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే..

గతంలో ఖమ్మం మొత్తంలో ఒక హోల్‌సేల్ మార్కెట్, బస్టాండ్, కాల్వొడ్డులలో మాత్రమే కూరగాయల మార్కెట్లు ఉండేవి. అవి నిత్యం కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ ఉండేవి. ఈనేపథ్యాన జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రభుత్వం కొత్త మార్కెట్లను ఏర్పాటు చేస్తూ వచ్చింది. కానీ మార్కెట్ ఎక్కడ నిర్మిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందనే కనీస అవగాహన లేకుండా నిర్మించడంతో అవి నిరుపయోగంగా మారి ప్రజాధనం పెద్ద ఎత్తున వృథా అయింది. కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే ఈ మార్కెట్లను ఇష్టారీతిన నిర్మించారనే ఆరోపణలు అక్కడక్కడా వినిపిస్తున్నాయి.

తెరుచుకోని నాన్ వెజ్ మార్కెట్లు..

నగరంలోని నూతన బస్టాండ్ సమీపాన రూ.3 కోట్లు, వీడీవోస్ కాలనీలో రూ.8.54 కోట్లు వెచ్చించి వెజ్–నాన్‌వెజ్ మార్కెట్లను ఏర్పాటు చేశారు. కానీ అందులో వెజ్ మార్కెట్ తప్పా, నాన్‌వెజ్ మార్కెట్ షెడ్లు తెరుచుకోవడం లేదు. అక్కడ చికెన్, మటన్, చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. నూతన బస్టాండ్, రాపర్తినగర్, మామిళ్ళగూడెం, బైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాలకు హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ సమీపంలో ఉండడంతో పాటు కూరగాయలు సైతం హోల్‌సేల్ రేట్లకే దొరుకుతుండడంతో అందరూ అక్కడకే వెళ్లి కూరగాయలు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో బస్టాండ్ వద్ద నిర్మించిన సమీకృత మార్కెట్ ఉపయోగం లేకుండా పోయింది. అడపాదడపా వచ్చే కొనుగోలుదారులతో కొంత మంది రైతులు మాత్రమే అక్కడ కూరగాయలు తెచ్చి అమ్ముకుంటున్నారు. నూతన బస్టాండ్ వద్ద ఉన్న మార్కెట్‌లో కొంత మంది చేపలు తెచ్చి అమ్ముకుంటున్నారు. వారికి సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని వాపోతున్నారు.

విక్రయదారులు కరువు..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత పాలకులు అత్యంత ఆర్భాటంగా వీడీవోస్ కాలనీలో సమీకృత వెజ్–నాన్‌వెజ్ మార్కెట్‌ను రూ.8.54 కోట్లతో నిర్మించారు. అందులో రెండు భారీ షెడ్లు వేసి ఒకటి వెజ్ మార్కెట్‌గా, మరొకటి నాన్‌వెజ్ మార్కెట్‌గా నిర్ణయించి ప్రారంభించారు. ప్రారంభం నుండే ఒక్క వెజ్ మార్కెట్‌కు మాత్రమే అంతంత మాత్రంగా కొనుగోలుదారులు వస్తుండగా.. నాన్‌వెజ్ మార్కెట్‌లో మాంసం విక్రయ దుకాణాలు పెట్టుకునేవారే కరువయ్యారు. ప్రారంభం నుండే అది తాళంవేసి ఉంది.

రోడ్ల పక్కనే విక్రయాలు..

రోడ్ల పక్కనే కూరగాయలు, పండ్లు విక్రయించే సంస్కృతి వైరారోడ్డు, బల్లేపల్లి, రోటరీ నగర్‌లతో పాటు నగరమంతా విస్తరించింది. దీంతో కొనుగోలుదారులు మార్కెట్లకు వెళ్లడం మానేశారు. తమ పనులు ముగించుకుని తిరిగి ఇంటి వెళ్లేటప్పుడు ఎక్కడో ఒకచోట కూరగాయలు తీసుకుని వెళ్తున్నారు. దీంతో మార్కెట్లలో కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేవారు లేక వెలవెలబోతున్నాయి. నగరంలోని పాత బస్టాండ్ నుంచి మొదలుకుని వైరారోడ్డు మొత్తం రోడ్లపైనే కూరగాయల అమ్ముతుండడంతో వాటిని కొనేందుకు ద్విచక్రవాహనాలు, కార్లు ఆపుతుండగా.. ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

తెచ్చిన సరుకు పాడవుతోంది..



ఎన్నో ఏళ్ల నుంచి వైరారోడ్డులో ఉన్న చేపల మార్కెట్‌లో చేపలు అమ్ముకుంటున్నాం. ఉన్నపలంగా అక్కడున్న చేపల మార్కెట్‌ను కూల్చి మమ్ముల్ని నూతన బస్టాండ్ వద్ద ఉన్న మార్కెట్‌కు తరలించారు. ఇక్కడ బేరాలు సరిగా లేక తెచ్చిన సరుకు పాడైపోయి నష్టపోతున్నాం. కనీస సౌకర్యాలు సైతం కల్పించలేదు. మా పాత మార్కెట్ స్థలంలోనే మాకు మార్కెట్ కట్టి ఇవ్వాలి

– కందరబోయిన పద్మ, చేపల విక్రయదారురాలు

ఎక్కడపడితే అక్కడ విక్రయాలు..



ఖమ్మం నగరమంతా ఎక్కడపడితే అక్కడ రోడ్లపై సైతం చేపల విక్రయ కేంద్రాలు వెలిశాయి. ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంతంలో చేపలు అమ్ముతున్నారు. అలాంటప్పుడు ఈ నాన్‌వెజ్ మార్కెట్లు ఎందుకు కట్టారో అర్థం కావడంలేదు. ఈ మార్కెట్లకు ఎవ్వరూ రాక అమ్ముకునేందుకు తెచ్చిన సరుకు కొన్ని సందర్భాలలో పాడైపోతుంది. పాత మార్కెట్ అయితే ఎప్పుడూ జనంతో ఉండేది.

– దేశబోయిన చంద్రకళ, చేపల విక్రయదారురాలు

మంత్రి తుమ్మలకు వినతులు



ఖమ్మంవన్‌టౌన్: మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేసి మోటార్ రంగ కార్మికులను ఆదుకోవాలని కేంద్ర కార్మిక సంఘాలైన ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, టీఎంటీడీయూల సంయుక్త ఆధ్వర్యాన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ చట్టం మూలంగా లక్షలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంకణాల శ్రీనివాస్, కొయ్యల శ్రీనివాస్, సీహెచ్.విప్లవ్‌కుమార్, జిల్లా ఉపేందర్, రావుల శ్రీను, పెరుగు భిక్షం, తోట సైదులు, నాగేశ్వరరావు, మురళి, ఘయాజ్ పాషా, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతి..

ఖమ్మం మామిళ్లగూడెం: బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం బీకే బజార్‌కు చెందిన సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు పాలకుర్తి కృష్ణ ఆధ్వర్యాన మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు వినతి పత్రం అందజేశారు. తన భార్య జ్యోతి పేరు మీద గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కొంత మంది ఆక్రమణకు గురి చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి అందించిన వారిలో పాలకుర్తి జ్యోతి, ఎరుకల సంఘం నాయకులు సుధాకర్, నరసింహ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పలువురిని కలిసిన మంత్రి తుమ్మల..

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగరంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొదిల రవికుమార్ ఇంటికి వెళ్లి అల్పాహార విందులో పాల్గొన్నారు. అదేవిధంగా మరో నాయకుడు కల్లూరి సోమనాథం ఇంట్లో మధ్యాహ్న భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిశోర్, కొత్తా సీతారాములు, సాధు రమేష్‌రెడ్డి, వడ్డెబోయిన నర్సింహారావు, బాణాల లక్ష్మణ్, బొమ్మ ఉదయ్ తదితరులు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి అంచనాలు..

మంత్రి ఆదేశాల మేరకు పరిశీలించిన అధికారులు

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటైన కాలనీల్లో రోడ్లు లేక నివాసులు ఇబ్బంది పడుతున్నారని గ్రామ సర్పంచ్ గుడిపుడి శారదరామారావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మందా బుచ్చిబాబు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సోమవారం మంత్రి అధికారులతో నిర్వహించిన సమీక్షలో చేయాల్సిన అభివృద్ధికి ఒక ప్రణాళిక తయారు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. దీంతో మంగళవారం పంచాయతీ సిబ్బంది పంచాయతీలోని కేసీఆర్, గ్రీన్, కేటీఆర్ కాలనీల్లో రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.2 కోట్ల నిధులు కావాల్సి వస్తుందని, దానికి ఉపాధి హామీ పథకం నిధుల నుంచి ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మందా బుచ్చిబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడిపూడి రామారావు, సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, మాజీ సర్పంచ్ రెంటల ప్రసాద్, ఎస్‌కె.హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌సీఓలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గురుకుల పాఠశాలలను పర్యవేక్షించడంలో ఆర్‌సీఓలు పూర్తిగా వైఫల్యం చెందారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, గోకినపల్లి మస్తాన్‌లు అన్నారు. గురుకులాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆయా సంఘాల నాయకులు మంగళవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌లను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైరా ఎస్సీ గురుకులంలో ఆవరణమంతా పిచ్చి మొక్కలు మొలిచి పాములు చేరాయని, దీంతో సోమవారం రాత్రి ఓ విద్యార్థిని పాము కాటుకు గురైందని అన్నారు. గురుకులాలను ఆర్‌సీఓలు సందర్శించడం లేదని ఆరోపించారు. గురుకులాలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మడుపల్లి లక్ష్మణ్, పనుకుల సుధాకర్, మణికంఠ, మధు, తరుణ్, వరుణ్, నరేష్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

రాజారాంపేట సొసైటీ చైర్మన్ మృతి

నేలకొండపల్లి: మండలంలోని రాజారాంపేట (చెరువుమాధారం) ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ పగిడిపత్తి శ్రీనివాస్(44) మంగళవారం మృతి చెందాడు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతుండగా.. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా ఆయన మృతదేహాన్ని డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, సీఈఓ రెహమాన్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, సర్పంచ్ ఈవూరి సుజాత, ఎంపీటీసీ కనమర్లపూడి పుష్పలత, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఈవూరి శ్రీనివాసరెడ్డిలతో పాటు వివిధ సొసైటీ చైర్మన్లు, సీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు..

నేలకొండపల్లి: సీపీఎం సీనియర్ మండల నాయకుడు తిగుళ్ల నర్సయ్య (60) ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికు భార్య, కుమారుడు ఉన్నారు. ఆయన మృతదేహాన్ని సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, ఎంపీటీసీ రేగూరి వాసవి, వివిధ పార్టీల నాయకులు కే.వీ.రెడ్డి, పగిడికత్తుల నాగేశ్వరరావు, బోయినపల్లి వీరయ్య, మేకల వెంకటేశ్వర్లు, కొండల్, మేకల అర్జున్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, పరిక మాధవి, మేకల పేరయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తొమ్మిది మంది నేత్రదానం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ఐ బ్యాంక్ ద్వారా తొమ్మిది మంది నేత్రాలను సేకరించినట్లు ఐ బ్యాంక్ సెక్రటరీ ఆర్.ఏ.పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 22వ తేదీ వరకు సత్తుపల్లికి చెందిన ఇనపనూరి మాణిక్యమ్మ, దాసరి పుష్పావతి, జంగాల సీతామహాలక్ష్మి, కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామానికి చెందిన మిట్టపల్లి సీతారాములు, నల్లగొండ పట్టణానికి చెందిన ఎల్.శ్రావణ్‌కుమార్, ఖమ్మం నగరంలోని పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన గంజి సుబ్బలక్ష్మి, పీసీకే తోటకు చెందిన కొత్తూరు రంగమ్మ, జహీర్‌పురకు చెందిన బూస పద్మవతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన పల్లెలపాటి రాజ్యం నేత్రాలు సేకరించామన్నారు. వీరి నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్, అగర్వాల్ ఐ బ్యాంక్, వాసన్ ఐ బ్యాంక్‌ల్లో భద్రపరిచినట్లు చెప్పారు. కళ్లు అవసరమైనవారు 93971 91919 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

కామేపల్లి: గరిడేపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మండల పీహెచ్‌సీ నేత్ర సంచాలకుడు డి.మహేందర్ మంగళవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దృష్టిలోప నివారణకు పిల్లలు ఆకుకూరలు, కూరగాయాలు, క్యారెట్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు తమ దృష్టిని ఏవిధంగా మెరుగుపర్చుకోవాలో తగిని సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నాగిరెడ్డి, దేవాసింగ్, అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీలో నారాయణ విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఈనెల 21న జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలో నారాయణ పాఠశాల విద్యార్థిని వజాల సియోన అండర్–9, 11, 13 బాలికల పోటీల్లో సత్తా చాటుకుంది. అండర్–9 సింగిల్స్‌లో ప్రథమ, అండర్–11లో డబుల్స్‌లో ప్రథమ, అండర్–13 సింగిల్స్‌లో తృతీయస్థానాల్లో నిలిచింది. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటుకోవడం పట్ల జిల్లా ఏజీఎం వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సురేశ్, కోఆర్డినేటర్ లక్ష్మీసుష్మ, కిశోర్ చందులు అభినందనలు తెలిపారు.

ఎరువుల నిల్వల్లో తేడాలు ఉండొద్దు..



పండితాపురంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

కామేపల్లి: ఫర్టిలైజర్ దుకాణాల్లో డీలర్లు విక్రయించే ఎరువుల నిల్వల్లో ఎటువంటి తేడా ఉండొద్దని, రైతులు కొనుగోలు చేసిన ప్రతీ ఎరువు బస్తాను రశీదు బుక్, పీఓఎస్ మిషన్‌లో నమోదు చేయాలని ఖమ్మం డివిజన్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండలంలోని పండితాపురం, జాస్తిపల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్ యాప్ ద్వారా దుకాణాల్లో ఎరువుల నిల్వలను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డీలర్లు పీఓఎస్ మిషన్ ద్వారానే ఎరువుల అమ్మకాలు చేపట్టాలని, రైతులు ఎరువుల కొనుగోలుకు ఆధార్ తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ షేక్ మున్నీ, ఉషా, డీలర్లు అంబడిపూడి హరీశ్, నూకల నరేశ్, గాడిపల్లి శ్రీను, తమ్మినేని శ్రీనివాసరావు తదితరులున్నారు.

పశు వైద్య శిబిరం విజయవంతం



మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండ గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ వారి సౌజన్యంతో గోపాలమిత్ర పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు, లేగదూడలకు నట్టల నివారణ మందు పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రైతులకు పశు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకే ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని గోపాలమిత్రల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ వైద్యాధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు టి.సంజయ్‌రెడ్డి, అనంతు హరీశ్, సర్పంచ్ అనిత, ఎంపీటీసీ కట్టెకోల సుధాకర్, రైతులు గడ్డం నాగేందర్‌రావు, వెంకటనర్సయ్య, అనంతు శ్రీనివాసరావు, పకీరయ్య, గోపాలమిత్రలు తాజ్‌పాషా, నాగరాజు, పాండురంగయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

తిరుమలాయపాలెం: గ్రాడ్యుయేట్ అర్హత కల్గిన పట్టభద్రులు తమ ఓటు నమోదుకి దరఖాస్తు చేసుకోవాలని మండల తహసీల్దార్ రామ్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 కల్లా డిగ్రీ పట్టా పొందిన వారు ఫారం 18 ద్వారా వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా కూడా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

దళితులంతా ఐక్యంగా పోరాడాలి

కామేపల్లి: సమస్యల పరిష్కారం కోసం దళితులంతా ఐక్యంగా పోరాడాలని దళిత ఐక్యవేదిక సభ్యుడు చిప్పలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మానుకొండ ఆనందరావు అధ్యక్షతన మండలంలోని కొత్తలింగాలలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల దళిత ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులు రాజకీయంగా ఎదిగేందుకు సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్డిగర్ల సుందరం, పాలే నాగేశ్వరరావు, ఆదూరి ప్రసాద్, గోపీ సత్యనారాయణ, బొందల వెంకట్, పూదూరి రామారావు, రెంటాల వెంకన్న, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో వందశాతం ఫలితాలు సాధించాలి



ఎంవెంకటాయపాలెంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మంరూరల్: ఈ ఏడాది పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలని డీఈఓ సోమశేఖర శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని ఎం వెంకటాయపాలెం, చింతపల్లి, కాచిరాజుగూడెం, ప్రభుత్వ పాఠశాలలను డీఈఓ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారిని వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు. అంతేకాక వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరుపై సమీక్షించారు. ఆయన వెంట సీసీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పదేళ్లయినా పట్టించుకోరా..?



నగరంలోని 15వ డివిజన్ పుట్టకోట గ్రామ పంచాయతీని గత పదేళ్ల క్రితం కార్పొరేషన్‌గా మారిన ఖమ్మంలో విలీనం చేశారు. నాటి నుంచి ఆ భవనంలో బ్రాంచ్ పోస్టు ఆఫీస్‌ను కొనసాగిస్తుండగా.. ఆ భవనంపైన పంచాయతీ కార్యాలయం పేరు అలానే ఉంది. పదేళ్లయినా ఇంకా ఆ భవనంకు పేరు మాత్రం మారకపోవడంతో పోస్టు ఆఫీస్‌లో ఉపయోగించే పోస్టు బాక్స్ ఏ ప్రాంతానికి వినియోగిస్తున్నారో తెలియక గందరగోళం నెలకొంది. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి జనాలకు తెలిసేలా బోర్డు మార్చాలని పలువురు కోరుతున్నారు.

– ఖమ్మంఅర్బన్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990
వైరా ఐ. రాందాస్ - 98898 81843
రమేష్, ACO - 9059115968
మధిర వీరబాబు - 98498 64638
సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎస్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957